# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్




ఆ పొద్దు మాపటేల రెండు పదున్ల వాన పడింది. కొండలూ గుట్టలూ, చెట్టూ పుట్టా వానలో స్నానమాడినాయి. నేల చెమ్మగిల్లింది. పులుగూ బూసీ బొక్కల్లో నుంచి బయటకొచ్చి చల్లనిగాలికి మైమరిచినాయి. చీకటి పడగానే మా ఇంటెనక నుండే సుంకేసిరి చెట్టుని మిలమిలా మిణగర బూసులు ముసురుకున్నాయి. సుంకేసిరి చెట్టు చుక్కల్ని పూసినట్టుంది.

## గోపినింటి దీపం

మాయమ్మ పచ్చిపేడని ముద్దచేసి, చెట్టునుంచి కోసిన ఆముదం ఆకులో పెట్టి, ఆ ముద్ద మీద మట్టి పమిదిని గుచ్చింది. పమిదలో ఆముదం పోసి, వత్తివేసి పెద్దింటి (దేవునిల్లు) దీగూట్లో పెట్టి దీపం వెలిగించింది. పెద్దిళ్ళంతా వెలుగుతో నిండిపోయింది.



దీపానికి పసుపు కుంకమ పెట్టి, దేవునికి దండం పెట్టుకునింది మాయమ్మ.

నేను, పీరుగోడు కిరసనాయిలు బుడ్డీ దెగ్గిర కూర్చోని చదువుకుంటా వుండాము. మా గొర్రెల తాత పొయ్యికాడ కూర్చోని పుల్లలు ఏగేస్తా వుండాడు. వెనకనించి రెండు చేతులతో మా తాత మెడని బిగదీసి, చెవులో ఏదో గొణగతా ముదిగారం పడతా వుండాది మా చెల్లి వసంత. గొడ్లు గడ్డిమేస్తా వుండాయి. మా చిన్నవ్వ పెద్దావు ముందు కుర్చోని పిడుదులు ఏరతావుంటే, ఆవు గడ్డి మేయకుండా మూతిని ముందుకు సాపి, సగించినట్టు కళ్ళు మూసుకునింది. మా నాయన నీళ్ళు కట్టేదానికి మడికాడికి పోయినాడు.

పొయ్యిమీద వొట్టి చేపల కూర కుతకుతా

వుడకతా వుండాది. ఇంకెక్కడ సదవతాను నేను. ఆ చేపల కూర వాసనకి మతి తప్పుంటే! మా పీరు గోడు పెద్దగా నోరెత్తి ''అశోకుడు చెట్లు నాటించెను. శ్రీకృష్ణదేవరాయలు చెరువులు తవ్వించెను'' అని అరస్తా చదవతా వుంటే, నేను కిరసనాయిలు బుడ్డీ నీడతో ఆట్లాడుకుంటా వుండాను. మాయమ్మ దీపం పెట్టి పెద్దింట్లోనుంచి వచ్చింది.

''అమా నాకు ఆకలేస్తా వుండాది. సంగటి పెట్టు'' అన్నేను.

''ఇస్కూలు నుంచి వస్తానే, ఇంత ... ఉలవ ముద్ద చించితివే, అప్పుడే ఆకలా నీకు? నీకంటే చిన్నోడు వాడు. ఎంత నిష్టగా చదవతా వుండాడో చూడు. వాడు నా బిడ్డంటే! అంతా నా వాటం. నువ్వు అంతా మీ నాయన వాటం. ముద్దలు తిని ఎద్దులు మేపే రకం'' అనింది పెగ్గిపడతా.

ఎప్పుడో ఇస్కూలు నుంచి వచ్చినప్పుడు తినింది ఉలవతొక్కు. ఇంగా దూరుకోని వుంటుందా కడుపులో? మాయమ్మ చెప్పేది ఇచ్చిత్తరం కాకపోతే! నాకు అప్పుడు భలే కోపం వచ్చింది.

''తిడితే నన్ను తిట్టు కాని, వానితో పోలికపెట్టి నన్ను తిట్టొద్దు'' అన్నేను.

మాయమ్మ తిరమలకొండ మింద బాగా సదివేదంట. ఇస్కూలుకి ఫస్టు వచ్చేదంట. మా పీరు గోడు గూడా మాయమ్మ మాదిరే బాగా సదవతాడని, ''వాడు నా బిడ్డంటే! అంతా నా వాటం'' అని మురిసిపోతా ఎచ్చులు చెప్పుకుంటా వుంటింది.

మాయమ్మ సంగటి ముద్దలు చేసేదానికి పొయ్యికాడికి పొయింది.

మా పీరుగోడు నిష్టగా సదవతా వుంటే నాకు భలే వొళ్ళు మండతా వుండాది. వీని సదువుని ఎట్టయినా చెడగొట్టాలని ఒక ఐడియా ఏసినాను. నిక్కరు పట్టుకోని గుంజినాను.

వాడు పట్టించుకోకుండా ''అశోకుడు చెట్లు నాటించెను. శ్రీకృష్ణదేవరాయలు చెరువులు తవ్వించెను'' అని సదివింది సదివింది గానే వుండాడు.

కోపమొచ్చి గూబ మీద ఒగటి ఇచ్చినాను.

ఆ దెబ్బకి ''అబ్బా!'' అని ఉలిక్కిపడి ''నీయమ్మా.. ఎందుకురా నన్ను కొట్టినావు?'' అన్నేడు గూబమీద ఎడం చేత్తో తుడుసుకుంటా.

''కొట్టకా ముద్దు పెట్టుకుంటారా నిన్ను. పుస్తకం పక్కనపెడితే గోడమింద నీకు సినిమా చూపిస్తాను'' అన్నేను.

''గోడమింద సినిమానా? ఎట్ల చూపిస్తావునా?'' అని అడిగినాడు. దెబ్బ తినింది గూడా మరిచిపోయ్యి, సదివే పుస్తకం పక్కన పెట్టి.

''ఇద్దో ఇట్లా!'' అని దీపానికి అడ్డంగా వేళ్ళను పెట్టి గోడమింద గుఱ్ఱం నీడపడినట్టు మేజిక్కు చేసినాను. ''గప్పుడు గప్పుడని'' నోటితో అంటా, వేళ్ళను కదపతా గోడమీద గుఱ్ఱం నీడ పరిగెత్తినట్టు మేజిక్కు చేసినాను.

మా పీరుగోడు ఇచ్చిత్తరంగా చూస్తా, ''అనా...! ఎట్లనా చేసినావు నువ్వు?'' అని అడిగినాడు.

మళ్ళీ వేళ్ళతోనే గాంధీతాత ఉతకట్టి పొడుసుకుంటా గోడమింద నడిసిపొయినట్టు మేజిక్కు చేసినాను. పులి గాండ్రించి మిందికి దూకినట్టు మేజిక్కు చేస్తే మా పీరుగోడు ఉలిక్కిపడి ''ఓయమ్మా!'' అని అరిసినాడు. గువ్వ ఎగిరిపోయినట్టు, కుక్కలు కాట్లాడుకున్నట్టు మేజిక్కు చేసినాను.

మా పీరుగోడు భలే సంతోసపడిపోయినాడు. గుక్క తిప్పుకోకుండా నవ్వతా, కిందపడిపొయ్యి చప్పట్లు కొట్టినాడు. వాడి సదువునట్లా సంకనాకించినందుకు అప్పుడు నాకు గూడా భలే సంతోషంగా వున్నింది.

దబరనిండా రాగిపిండి సంగటి ముద్దలు చేసుకోని తెచ్చింది మాయమ్మ. గోడమింద నీడలతో ఆడుకుంటా వుండే మమ్మల్ని చూసి, ''మేసే గాడిదను కూసే గాడిదొచ్చి చెడగొట్టడమంటే ఇదే! లెయ్యిండి లెయ్యిండి. గిన్నె తెచ్చుకోండి సంగటేస్తాను'' అనింది.

ఆ మాట మాయమ్మ నోట్లోంచి రావడం ఆలస్యం, టక్కున గిన్నెతో వచ్చి నిలబడినాను. కాళ్లూ చేతులూ కడుక్కోని. మా గొఱ్ఱెల తాత, మా చిన్నవ్వ గూడా తినేదానికి కూర్చున్నారు. మా గొఱ్ఱెలతాత, మా చిన్నవ్వ, నేను తప్పా మా ఇంట్లో ఎవరు చేపలకూర తినరు. చేపలని చూస్తానే ''అబ్బా! అసింకం, వాసన'' అని సింగిలించుకున్నట్టు మూతి పెడతారు.

వాళ్లకి ఏం తెలుసు పిచ్చోళ్ళు. చేపల కూరంటే దేవుళ్ళకి మాత్తరమే దక్కిన అమృతం గదా! ముద్ద గుంత చేసి, ఆత్రంగా కూరలో ముంచి చిప్పగరిటెడు చేపలు ఏసుకున్నాను. చిన్న చిన్న ముద్దలుగా చేసి, కూరలో ముంచి మింగతా వుంటే, వుడుకుడుకు ముద్దలు కమ్మగా గొంతులో నుంచి కడుపులోకి 'సరుక్కు సరుక్కుమని' జారిపోతా వుండాయి.

అందరికంటే ముందు గిన్నె తెచ్చి కూర్చున్నానా, అందురు తిని గిన్నెలు కడిగేసినాక, అందరికంటే ఎనకాల 'చూపుడు వేలితో గిన్నె అడుగు తుడుచుకోని నాక్కుంటా' పైకి లేసినాను. అప్పటికిగాని నాకు తృప్తిలేదు.

మా గొఱ్ఱెల తాత పొయ్యి మంచంమీద కూర్చోని బీడీ ముట్టించినాడు. మా చిన్నవ్వ మల్లా పెద్దావు దెగ్గిరికి పొయింది పిడుదులు ఏరేదానికి. మాయమ్మ వసంతని సంకలో పెట్టుకుని అన్నం తినిపిస్తా వుండాది. పీరుగోడు మల్లా కిరసనాయిలు బుడ్డీముందు కూర్చోని పుస్తకం తెరిచినాడు.

నేను గిన్నె కడిగి నీళ్ళు కుడితి బానలో ఇదిలిస్తా వుండాను. ఇంతలో పిడుగు పన్నెట్టు గెసపోసుకుంటా వచ్చినాడు రాజన్న. ''సినమ్మా సినమ్మా'' అంటా బిత్తర బిత్తరగా చూసినాడు మా అందరికల్లా.

''ఏమైందిరా... ఏమైంది?'' అని గద్దించినాడు మా గొఱ్ఱెల తాత.

''తాతా... చిన్నాయనని మడికాడ నాగుపాము కరిసింది'' అని అంటా వుండాడు, పచ్చార్ల

## కథకు కొత్తసొగసు గోపిని కరుణాకర్

గోపిని కరుణాకర్ తెలుగు పాఠకులకు పరిచితమైన పేరే. జానపదం మాండలికాన్ని కలగలిపి తెలుగు కథకు కొత్త అందాలు తెచ్చారు గోపిని. ప్రకృతిలో ఆధ్యాత్మికత మిళితమైన తిరుమలలో జన్మించారు. తిరుమల, పీలేరుల్లో చదువుకున్నారు. కలం పట్టి పదేళ్లు దాటింది. 25 కవితలు రాశారు. అవన్నీ 'ఉత్తీత పాట' అనే సంకలనంగా వస్తున్నాయి.

ఆయన రాసిన 'దుత్తలో చందమామ' కథకు అవార్డు లభించింది. మొత్తం పది కథలకు పైగా రాశారు. ప్రస్తుతం సినిమా ఫీల్డ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

వారం వారం దీపం చెప్పిన కతలను నవ్య పాఠకులకు గోపిని కరుణాకర్ అందిస్తారు.

చిరునామా:
గోపిని కరుణాకర్,
కేరాఫ్ ఎం.డి.ఆచార్య,
ఇం.నెం. 8-2-22/2,
పంజాగుట్ట, శ్రీనగర్ కాలనీ రోడ్,
హైదరాబాద్.

సిద్దులు, కళ్ళావాళ్ళపల్లె వెంగటాద్రి బుజం మింద మోసుకోని వచ్చి, మా నాయన్ని తిన్నె మింద పడుకోబెట్టినారు. మా నాయన గుడ్లు తేలేసినాడు.

మాయమ్మ ''ఓయమ్మల్లా!'' అని భీతరపు అరిసింది. ఆ అరుపుకి మా వసంత కెవ్వుమని ఏడ్చింది.

''ఇంగేం చేసిదిరా దేవుడా!'' అని మా నాయన్ని పట్టుకోని ఏడస్తా వుండాది మా చిన్నవ్వ. మా గొర్రెల తాతకి కాలూచెయ్యా ఆడ్డంలేదు. వాళ్ళు ఏడస్తావుంటే మేము ఏడ వడం మొదలుపెట్టినాము.

మా ఏడుపులు విని మా పెద్దత్త, బొజ్జత్త, సక్కుపిన్నమ్మ పల్లెపల్లెంతా వచ్చేసింది. మా ఇంట్లో ఏడుపులతో 'ఆలగోడు బాలగోడుగా' వుండాది. 'కాసరబీసరని' అరుపులు రాజన్న బోడి డాక్టరు కోసం సాయిబులపల్లెకి పరిగెత్తి నాడు. మా నాయన ఎడమ కాలు పాదం మీద రెండు గాట్లు పడుండాయి. నెత్తురు కారి వుండాది. కొంచెం పైన మోకాలి దెగ్గిర నెత్తురు ఎగబాకకుండా, బిర్రుగా పైగుడ్డతో కట్టుకట్టి నారు. బిలేడుతో గాటు దెగ్గిర కోసి నోటితో పీల్చి నెత్తురు పక్కకి వుమ్మేసినాడు పచ్చార్ల సిద్దులు. మా చిన్నవ్వ పచ్చిమిరపకాయ తెచ్చి ఇచ్చింది నమలమని. మా నాయన కారమని చూడకుండా కసాబిసా అని నమిలేసినాడు.

''ఎట్టుండాది నాయనా! కారంగా వుండా దా?'' అని అడిగింది.

గుడ్లు తేలేస్తానే, కారంగా వుండాదని తల వూపినాడు.

ఆ మాటకి మా చిన్నవ్వ ఊపిరి పీల్చుకు నింది. 'కారంగా వుంటే ఇంగా తలకి ఇసమెక్క లేదులే! ధైర్నంగా వుండు అనుమంతు. నీకేం కాదులే నాయనా'' అంటా మా తాత పక్కన్నే కూర్చోని ధైర్నం మాటలు చెప్తా వుండాది. మాయమ్మ పెద్దింట్లోకి పొయ్యి నెమలి దేవుడు (సుబ్రమణ్యస్వామి) పటం ముందు నిలబడి దండం పెట్టుకునింది. వీబూది తెచ్చి మా నాయన నుదుటి మింద పూసింది. నోట్లో కొంచెం ఏస్తే వీబూదిని చప్పరించి, 'అరోహర అరోహర' అన్నేడు.

ఇంతలో సాయిబులపల్లె నుంచి బోడి డాక్టర్ వచ్చేసినాడు. ఆయన్ని చూసి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషానికి విరుగుడుగా ఇంజెక్షన్ ఇచ్చినాడు. కొంచేపటికి మా నాయన పాణం కుదుటపడింది.

''ఇంగపైపాణానికి ఏం భయం లేదులే! కాని ఈ రేత్తిరంతా కంటిమింద రెప్పెయ్యగూ డదు. నిద్రపోతే తలకి ఇషమెక్కేస్తింది. ఈరే త్తిరి గడిస్తే గండం గడిచినట్టే'' అని చెప్పి పాము గాట్లు పడినచోట ఏందో మందేసి కట్టు కట్టినాడు.

మా తాత ఇచ్చిన డబ్బు తీసుకుని బోడి డాక్టరు యలబారిపోయినాడు. బేగు పట్టుకోని తోడుగా రాజన్న డాక్టర్‌తోపాటు నడిచినాడు.

మా నాయనకి కొంత ధైర్యం వచ్చిన ట్టుండాది. బిత్తర చూపులు చూడ్డం లేదు. రాతి కూసానికి ఆనుకోని కూర్చున్నాడు. మాయమ్మ గంజి కాచేదానికి పొయ్యికాడికి పొయింది.

ఇంతలో సాయిబులపల్లె నుంచి బూబత్త, కాసీమ్ మామ వచ్చినారు. బూబత్త కళ్ళ నిండుకు నీళ్ళు పెట్టుకోని, బురఖా తీసి మా నాయన పక్కన కూర్చునింది. కాసీమ్ మామని చూసి మంచం దెగ్గిరికి లేచిపోయి నాడు మా గొర్రెల తాత.

''ఇంతరాత్తిరిపూట రాకపోతే ఏం పొయింది? పొద్దున్నే వచ్చి వుండొచ్చుగదా!'' అన్నేడు మా గొర్రెల తాత.

''ఇప్పుడు రాకపోతే నీ కూతురు నన్ను బతకనిస్తుందా? రాజన్న వచ్చినప్పుడు నేను బోడి డాక్టరు దెగ్గిరే వుండాను. పాము కరి సింది అని తెలిసి గుండెకాయ నీళ్ళయిపొయ. ఎట్టుండాదో, ఏమోనని నేను, నీ కూతురు పరుగెత్తుకుని వస్తా వుండాము'' అని 'జెగ్గు జెగ్గు' అని ఎగరతా చెప్పినాడు.

కాసీమ్ మామ పాత సినిమాల్లో రమణా రెడ్డిలా వుంటాడు. భూమ్మీద నిముషం నిలబ డకుండా, తోలుబొమ్మలా చేతులెగరేస్తా బిత్తర బిత్తరగా మాట్లాడతా వుంటాడు.

మాయమ్మ గంజి కాచుకోని వచ్చింది. వేడివేడిగా రెండు గ్లాసులు తాగినాడు మా నాయన. వసంత ఏడస్తా వుంటే పాలిస్తా పరు పుమింద పడుకునింది మాయమ్మ. వచ్చినోళ్ళు వొక్కొక్కరే నిద్రపొయ్యేదానికి యలబారిపో యినారు.

''రారా నా బట్టా! నా దెగ్గిర పడుకుందువు రా?'' అని పీరుగోడ్ని తోసుకోని వాళ్ళింటికి పొయింది బొజ్జత్త.

పెద్దత్త, సక్కు పిన్నమ్మ, బూబత్త, మా చిన్నవ్వ, మా నాయనతోపాటు మేల్కొనే వుంటామని చెప్పి, వక్కాకు నమలతా, అరు వులు చేస్తా కూర్చున్నారు. మా కాసీమ్ మామ, గొర్రల తాత బీడీమింద బీడీలు కాలుస్తా ''అదిగో తోక అల్లుడూ అంటే, ఇదిగో పులి మామ'' అని ఎచ్చులు చెప్పుకుంటా వుండారు.

నేను మా నాయన పక్కనే కూర్చోని వాళ్ళు చెప్పుకునేది వింటా వుండాను.

''పో నాయనా! పొడుకోబో'' అనింది నన్ను చూసి చిన్నవ్వ.


''నాకు నిద్దర రావటం లేదువా. నేను మీతోపాటే మేల్కొంటాను'' అని చెప్పినాను.

మా నాయన నన్ను దెగ్గిరికి తీసుకోని, ''నేను సచ్చిపోతానని భయమా?'' అని అన్నేడు నాతో. ఆ మాటకి నాకు కళ్ళల్లో నీళ్లు వచ్చి నాయి.


పెద్దింట్లో దీపం ఆరిపోతా వుంటే. వత్తి సరిచేసి పమిద నిండా ఆముదం పోసింది చిన్నవ్వ. మళ్ళీ దీపం ఊపిరిపోసుకునింది. ★

# హైకూలు

*- శ్రీనివాస్ అంకే*



కలాన్ని
హలంలా ఎత్తాను
పద్యం
సేద్యమైపోయింది.




రాక్షసున్నయ్యుంటే
ఎంత బాగుండు
మేఘాల్ని పిండి దండేనికి ఆరేసిందు.




వరదొచ్చినా
వొరుపొచ్చినా
గొప్ప వ్యాపారస్తుడు కవి



నిన్న ఊర్లో మరణించిన రైతు
ఉదయాన్నే
పత్రికలో జన్మించాడు



అర్థరాత్రి స్వాతంత్ర్యం
ప్రభుత్వం
నిద్రలేవలేదింకా....



చుక్కలు
చుక్కలుగా నువ్వేడ్చి
నన్నలా కాల్చకే
వెన్నెలా